## ట్రాన్స్ఫార్మర్స్‌ను పరిశీలించిన ఎస్ఈ

ముద్దనూరు. జులై 25. ప్రభాతవార్త:

మేజర్ గ్రామపంచాయతీలో రహదారికి ఇరువైపులా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన ట్రాన్స్ఫార్మర్స్ ను, విద్యుత్ తీగలను జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ రమణ శుక్రవారం నాడు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అనంతరం మండలంలో విద్యుత్ అంతరాయం లేకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు ముందస్తు చర్యలు తీసుకొని రైతులకు, ప్రజలకు విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజగోపాల్, ఏఈ శ్రీనివాసుల రెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు సేవ కేంద్రం సిబ్బందికి డివిజనల్ స్థాయిలో శిక్షణ

మైదుకూరు, జులై 25, ప్రభాతవార్త:



రైతు సేవా కేంద్రం సిబ్బందికి ప్రకృతి వ్యవసాయం పై డివిజన్ స్థాయిలో శిక్షణ కార్యక్రమం. రెండో రోజు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏడిఏ మాట్లాడుతూ గ్రామస్థాయి సిబ్బంది ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని మరియు ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఆదిరెడ్డి పల్లె యూనిట్ పరిధిలో ఓబయ్యపాలెం నందు, ఘనజీవామృతం ద్రవ జీవామృతం విత్తన గుళికలు నీమాస్త్రం తయారుచేసి ఉపయోగాలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలియజేయడం జరిగింది. అనంతరం బయో రీసెర్చ్ సెంటర్లోని ఉత్పత్తులను సందర్శించడం జరిగింది. అనంతరం ఏవో బాలగంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వలన భూమిలో సేంద్రియ కర్బనం అధికంగా పెరుగుతుందని భూమిలో ఉపయోగకరమైన సూక్ష్మజీవులు పెరుగుతాయని సారవంతమైన నేలను తరువాతి తరాలకు అందించాలని రసాయనిక ఎరువుల వినియోగం వలన కలిగే నష్టాలను తెలియజేశారు మరియు వివిధ రకాల సేంద్రియ వ్యవసాయ పద్ధతుల గురించి కూలంకషంగా తెలియపరిచారు ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, చెన్నయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మరియు డివిజన్ లో గల రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## యువకాపునాడు అధ్యక్షులుగా గొర్రెరమణ

కురబలకోట, జులై 25 ప్రభాతవార్త :

తంబళ్ళపల్లె నియోజకవర్గ యువకాపునాడు అధ్యక్షులుగా కురబలకోట మండలానికి చెందిన గొర్రె రమణను నియామకం చేస్తూ యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షులు పూల చైతన్య, రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షులు శెట్టి సీతారామ్ బాబులు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గొర్రెరమణ మాట్లాడుతూ నాకు ఈ పదవి రావడానికి సహకరించిన పూల చైతన్యకుమార్, శెట్టిసీతారామ్‌బాబులకు ధన్యవాదాలు తెలిపారు. నాపై నమ్మకంతో ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని రమణ తెలిపారు.

## శ్రావణమాసం శుక్రవారం దుర్గలమ్మ ప్రత్యేక పూజలు

రామసముద్రం జులై 25 ప్రభాతవార్త



మండలకేంద్రంలో ని బిసి కాలనీ వద్ద వెలసిన దుర్గలమ్మ ఆలయం నందు శ్రావణ శుక్రవారం పర్వదినం రోజున భక్తులు ఘనంగాపూజలు నిర్వహించారు. ఆలయప్రాంగణంలో మామిడి, వేపాకుతో తోరణాలు కట్టి ముస్తాబు చేశారు. దుర్గలమ్మకు పలురకాల పుష్పాలు, నిమ్మకాయల హారం, వేపాకుతో అలంకరణ చేశారు. పూజారి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు . అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి అమ్మ వారికి పొంగల్ నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారి భక్తులకు అమ్మ వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అధిక దిగుబడులు సాధించవచ్చు

ముద్దనూరు. జులై 25. ప్రభాతవార్త:



సహజ సిద్ధ పద్ధతులతో వ్యవసాయం కొనసాగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ డిపిఎం ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రస్థాయి సిబ్బంది కీ రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ పంటలను రామమోహన్ రెడ్డి, ఏవో వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సందర్శించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి వ్యక్తి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అంటే సహజ సిద్ధ పద్ధతుల ద్వారా పండించే ఉత్పత్తులను తినాలి అని ప్రతి రైతు సహజ సిద్ధ పద్ధతుల వైపు మొగ్గు చూపేలా క్షేత్ర స్థాయి సిబ్బంది అవగాహన కల్పించాలనీ సూచించారు. సహజ సిద్ధ పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విధముగా సిబ్బంది శిక్షణలో మెళకువలు ను అలవర్చుకోవాలని వివరించారు. మాస్టర్ ట్రైనర్ నాగ సుబ్బారాయుడు బీజా మృతం, ద్రవ జీవామృతం ,ఘన జీవామృతం తయారు చేసే విధానం, ఉపయోగ పడే విధనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పకృతి వ్యవసాయ సిబ్బంది నూజహత్, ఐ. రమణయ్య, రామ సుధ ,ముని భూపాలుడు, మరియు వ్యవసాయ, ఉద్యాన సిబ్బంది, ఆత్మ సిబ్బంది, అభ్యుదయ రైతులు రమణా రెడ్డి, లక్ష్మీ నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్లేస్మెంట్ స్ట్రాటజీస్ సక్సెస్‌పై అవగాహన సదస్సు



కురబలకోట జులై 25 ప్రభాతవార్త

మదనపల్లె సమీపం మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ) విభాగము వారు యూనివర్సిటీ లోని ఐ.ఐ.ఐ.సి వారి ఆధ్వర్యంలో రియల్ వరల్డ్ ప్లేస్మెంట్ స్ట్రాటజీస్ ఫర్ సక్సెస్ అనే అంశం పై అతిధి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మిట్స్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి మరియు అరిష్టనెట్వర్క్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పూణే లో క్లౌడ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్న మోదీన్ రషీద్ అహమ్మద్ పాల్గొన్నారు. కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ జాబ్ ఇంటర్వ్యూలకి ప్రతి ఒక్కరు వారి స్కిల్స్ ను పెపొందించుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయనన్నారు. ప్రతి విద్యార్థి ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో వ్యవహరించాలని, సబ్జెక్టుమీద మంచి పట్టును ప్రదర్శించాలి అన్నారు. ఇంటర్వ్యూలో బాడీ లాంగ్వేజ్ కూడా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుంది అని అన్నారు. కార్యక్రమం లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ చొక్కనాథన్, కోఆర్డినేటర్ ఎస్తర్ మేరిలిన్, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన

చిన్నమండెం జులై 25 ప్రభాత వార్త:



మండలంలోని దేవగుడిపల్లి గ్రామంలో జల్లవాండ్లపల్లి సమీపంలో మాండవ్యనది ఒడ్డున వెలసిన మహిమాన్వితుడు మండెం లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయం పునర్నిర్మాణ పనులను శుక్రవారం పురావస్తు శాఖ ఏడి రజిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్తిగా దెబ్బతిన్న ఆలయ తమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. గర్భగుడిని అదేస్థానంలో పునర్నిర్మాణం కోటి రూపాయలుతో జరుగుతుందన్నారు. చాలావరకు నిర్మాణాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## పర్యటన విజయవంతం చేద్దాం:

కాశినాయన జులై 25ప్రభాతవార్త :



రాష్ట్రంలో బిజెపి పార్టీ బలోపేతమే ధ్యేయంగా 27 వ తేదీన కడప జిల్లాలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుసిరెడ్డి మనోహర్ రెడ్డి, బిజెపి మండల ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, మండల కార్యదర్శి బిజివేముల నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. కావున మండలంలోని బిజెపి నాయకులు, మండల అధ్యక్షులు ,మండల కమిటీ సభ్యులు, క్రియాశీలక సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## అతిధి భోజనం ఏర్పాటు

కాశినాయన జులై 25ప్రభాతవార్త :



కాశినాయన మండలం మూలపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రోజు 30 మంది విద్యార్థులకు బ్రహ్మంగారిమఠం సోమిరెడ్డి పల్లె గ్రామవాస్తవ్యులు జి .సుజాత అతిధి భోజనాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థులకు అతిథి భోజనంలో భాగంగా పలావు రైస్, చికెన్ ఫ్రై , స్వీట్స్, బిస్కెట్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మంచి కార్యక్రమాలకు ముందుకొచ్చి విద్యార్థులతో సంతోషంగా పాలుపంచుకోవడం ఆనందదాయకమైన విషయం. అతిథి భోజనాన్ని ఏర్పాటు చేసిన జి. సుజాత వారి కుమారుడు జి. రామసాయి గణేష్ కు పాఠశాల ఉపాధ్యాయుల, విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలియజేసుకోవడం జరిగింది.

## వైఫల్యాలు ఇంటింటికి తీసుకెళ్ళండి

### వైసిపి కార్యకర్తలకు నిస్సార్‌అహ్మద్ పిలుపు



నమాజ్‌లో పాల్గొని వస్తున్న నిస్సార్‌అహ్మద్

నిమ్మనపల్లె, జులై 25 ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వ వైఫల్యాలు ఇంటింటికి తీసుకెళ్ళడంలో వైసిపి కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలంలో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సుపరిపాలన తొలిఅడుగు అంటూ మళ్ళీ జనాన్ని మోసం చేయడానికి వస్తున్నారని, తస్మాత్ జాగ్రత్త అంటూ ప్రజలకు సూచించారు. తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటికి వచ్చి మోసపూరిత పథకాలు పేర్లు చెబుతున్నారని ప్రజలు మళ్ళీ వారి మాయలో పడి మోసపోరాదని సూచించారు. మండల కేంద్రంలోని బాబు ష్యూరిటి మోసం గ్యారెంటీ అన్న కార్యక్రమాన్ని వైసిపి కార్యకర్తలతో ఆయన నిర్వహించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుపరచకుండా కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైకాపా నాయకుల అరెస్టుల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని, పరిపాలనను ముఖ్యమంత్రి పూర్తిగా విస్మరించారని ఆయన ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ కాలనీకి పైప్ లైన్ మంజూరు.

తంబళ్లపల్లె జులై 25 ప్రభాతవార్త ః



తంబళ్లపల్లె మండలం పరసతోపు పంచాయతీ మోడల్ స్కూల్ సమీపంలోని కాలనీకి పైప్ లైన్ మంజూరైనట్లు ఆర్డబ్ల్యుఎస్ ఏఈఈ వినోద్ కుమార్ తెలిపారు. తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సూచనలతో పలు గ్రామాలలో ఆర్డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో పైప్ లైన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఆయన మోడల్ స్కూల్ కాలనీలో పైప్ లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలోని తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో తాగునీటి బోర్లతో పాటు పైప్ లైన్ పనులు శరవేగంగా పూర్తి చేయనున్నట్లు చెప్పారు.

## పశువులకు మెరుగైన వైద్య సేవలు

కలికిరి, జులై 25, ప్రభాతవార్త:



మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు కలికిరి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డా. వెంకట మునినాయుడు తెలిపారు. శుక్రవారం పత్తేగడ పంచాయతీ, కొటాల గ్రామంలో, పారపట్ల పంచాయతీ పారపట్ల కువరపల్లె గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు వెంకట మునినాయుడు, పాలెం పశువైద్యాధికారి పశువైద్య సిబ్బందితో గ్రామాల్లో పర్యటించి అనారోగ్యంతో బాధపడుతున్న పశువులకు వైద్య చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ఏ చిన్న సమస్య తలెత్తినా పశువైద్యాధికారిని సంప్రదించి వైద్య సేవలు పొందాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పత్తేగడలో సుపరిపాలన తొలి అడుగు

కలికిరి, జులై 25, ప్రభాతవార్త:

మండలంలోని పత్తేగడ పంచాయతీ పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సొంత పంచాయతీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం వంద శాతం పూర్తయింది. పత్తేగడ పంచాయతీలోని పోలింగ్ బూతులకు ఇన్‌ఛార్జిగా ఉన్న రాజంపేట పార్లమెంటు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు వాసనూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి తెదేపా ప్రభుత్వం సీఎం నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వంద శాతం కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కార్యక్రమం నిర్వహించి పూర్తి చేయడం జరిగింది. అదే విధంగా మర్రికుంటపల్లె పంచాయతీ, మేడికుర్తి పంచాయతీలలో రాజంపేట పార్లమెంటు జిల్లా ఉపాధ్యక్షుడు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. మర్రికుంటపల్లె పంచాయతీలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తూ ఇంటింటికి వెళ్లి తెదేపా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పత్తేగడ పంచాయతీ బూతు కన్వీనర్ కొటాల చల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.



## సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు

పెండ్లిమర్రి, జులై 25, ప్రభాతవార్త:

కడప వ్యవసాయ డివిజన్ పరిధిలోని వ్యవసాయ సిబ్బందికి ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయం శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 2వ రోజు మండలంలోని చెన్నంరాజుపల్లి గ్రామంలో కషాయాల గంగిరెడ్డి పొలంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా ద్రవ, జీవామృతం, ఘన జీవామృతం, వేప కషాయం వంటి కషాయాల తయారు విధానం, వాటి వాడకం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి కషాయాల గంగిరెడ్డి, మిగతా సేంద్రియ వ్యవసాయ రైతులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ అందరు సిబ్బంది ఈ సేంద్రియ వ్యవసాయ పద్ధతులను నేర్చుకొని మిగతా రైతులకు కూడా సేంద్రియ వ్యవసాయం చేసే విధంగా మార్చాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో కడప వ్యవసాయ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు సుమంత్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శ్రీదేవి, నాగర్చన, వ్యవసాయ విస్తరణాధికారి గంగాధర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, చెన్నమరూజుపల్లి సేంద్రియ వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

## రైతులు విషయంలో రాజకీయాలు చేయద్దు

పులివెందుల, జూలై 25, ప్రభాత వార్త:



రైతులు విషయంలో రాజకీయాలు చేయడం తగదని, డిమాండ్, కొరతలను, వాతావరణ పరిస్థితులను బట్టి ధరలు మారుతూ ఉంటాయని కేవలం రాజకీయం కోసం దిగజారుడు మాటలు వైకాపా నాయకులు మానుకోవాలని పులివెందుల టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల మార్కెట్ యార్డ్ లో దళారులు ఉన్నారని వారు ప్రస్తుత అధికార పార్టీ నాయకులతో చేసుకున్న ఒప్పందాల వలనే ధరలు తగ్గాయని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప ఆరోపించడం తగదన్నారు. 2019, 24 మధ్య చీని ధరలు పదివేల రూపాయలకు కూడా పతనమైన విషయం అందరికీ తెలిసిందేనని మరి అప్పుడు తగ్గినప్పుడు మీరు కూడా దళారీలతో ఒప్పందం చేసుకున్నారా అని ప్రశ్నించారు. కమిషన్ల కోసం కక్కుతి పడింది ఎవరు అన్న విషయం పులివెందులలో అందరికీ తెలుసన్నారు. ఒక మున్సిపల్ శాఖలో మాత్రమే కాదు అన్ని శాఖలలో అధికారుల కొరత ఉందని ఈ విషయంపై ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కానీ వరప్రసాద్ బెదిరింపుడు రీతిలో ఇష్టానుసారం మాట్లాడడం పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వం మీద, నాయకుల మీద బురద చల్లడం మానుకోవాలి అన్నారు.

## కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

దువ్వూరు, జూలై 25, ప్రభాతవార్త:



విద్యుత్ సంస్థలలో పని చేసే కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఇన్విటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయబ్ రసూల్ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద తమ డిమాండ్ల కొరకు ఆగస్టు 7వ తేదిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గోడ పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తే మూలవేతనం 46వేల రూపాయలు చెల్లించాలన్నారు. జీతాలు వ్యత్యాసం లేకుండా అందరికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ కార్మికులకు కోటి రూపాయలు ఆరోగ్య భీమా కల్పించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. విజయవాడలో జరిగే ఈ కార్యక్రమంలో విద్యుత్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యులు నాయబ్, సుబ్బరాయుడు, రామ్మోహన్, కొండయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీని బలోపేతం చేస్తాం

దువ్వూరు, జూలై 25, ప్రభాతవార్త:



రాబోయే కాలంలో భారతీయ జనతా పార్టీని గ్రామగ్రామాన బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా బీజేపి మాజీ అధ్యక్షుడు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన దువ్వూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడ పనులు చేస్తున్నామన్నారు. గతంలో జరిగిన జగన్ పరిపాలనలో ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడంతో ఆర్థిక పరిస్థితి అయోమయంగా ఉండేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంలో నరేంద్ర మోడి ప్రభుత్వం 11వేల కోట్ల రూపాయలు రాజధానికి కేటాయించిందని అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు 10వేల కోట్లు, జాతీయ రహదారుల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని ఇందుకు గాను కడప జిల్లాలోనే 18వేల కోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సెల్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, బీజేపి రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

దువ్వూరు, జూలై 25, ప్రభాతవార్త:



మండలంలో పనిచేసే 23గ్రామ పంచాయతీల కార్యదర్శులు ప్రస్తుతం వర్షాకాలం అయినందున మెరుగైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ"4 పథకానికి సంబంధించి నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం బంగారు కుటుంబాల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అలాగే వివిధ అంశాలపై చర్చించారు. ఉచిత ఇసుక పంపిణీ, హౌసింగ్, ప్రభుత్వ పథకాల సేవలపై ఆయన వివరించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలను తొలగించాలని వినతి

ఖాజీపేట, జూలై 25, ప్రభాతవార్త:

ఖాజీపేట మండలం పుల్లూరు పంచాయతీ పరిధిలో గల పుల్లూరు మాలవాడలో అక్రమణలు, అక్రమ కట్టడాలు తొలగించాలని పుల్లూరు గ్రామ ప్రజలు అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. వివరాల్లోకి వెళితే..సర్వే నెంబర్ 307, 301 భూమిలో గల స్థలాన్ని అక్రమణ చేసి పంట కాలువను పూడిచ్చ ఇదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా గృహాన్ని నిర్మిస్తున్నారని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలువను పూడ్చి అక్రమ కట్టడాలు కట్టడం వలన వర్షం వచ్చిన ప్రతిసారి పంట పొలాల్లోని నీరు గ్రామంలోని కొన్ని గృహాలలోనికి వర్షపు నీరు చేరుతుందని ఆ నీటితో పాటి విశ పురుగులు, పాములు, తేళ్ల అనేకరకమైన విశపురుగులు సంచారం జరుగుతుందని గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నామన్నారు. 307/1 సర్వే నెంబర్‌కు దక్షిణం వైపు 310 సర్వేనెంబర్ రాస్తా సిసి రోడ్డు గ్రామంలో గల రోడ్డు మీద అక్రమంగ గృహ నిర్మాణం చేయడం వలన గ్రామ ప్రజలకు మరియు పక్క గ్రామాల ప్రజలకు, రైతులకు వారి పంట పొలాల్లోకి వ్యవసాయ పనుల మీద వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉందని 500ఎకరాల ఆయకట్టు కలదని రైతులు అనునిత్యం వరిగడ్డి మరియు పిండి మూటలు అనేక రకమైనటువంటి వ్యవసాయ సామాగ్రిని ట్రాక్టర్లు, ఎద్దుల బండ్ల ద్వారా రవాణా చేయుటకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు సమస్య పైన గ్రామ ప్రజలు మరియు స్థానిక తహసీల్దార్‌కు మండల అభివృద్ధి అధికారికి, ఖాజీపేట సర్కిల్ ఇన్స్పెక్టర్‌కు, పంచాయతీ సెక్రటరీకి సమస్యను వినతిపత్రం ద్వారా విన్నవించుకున్నామన్నారు.



## వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



కడప కలెక్టరేట్, జులై 25 ప్రభాతవార్త:

నిరక్షరాస్యులైన వయోజనులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాంలో భాగంగా ఉల్లాస్ పథకాన్ని రూపొందించినట్లు జేసీ అదితి సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో అడల్ట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ ఉల్లాస్ పథకం పై జేసీ అదితి సింగ్ అధ్యక్షతన జిల్లాస్థాయి కన్వర్జెన్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జేసీ అదితి సింగ్ మాట్లాడుతూ... దేశంలో 2029 సంవత్సరం నాటికి 100 అక్షరాస్యతను సాధించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఉల్లాస్ పథకాన్ని అమలు చేస్తున్నాయని అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అక్షర ఆంధ్ర పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు.15 59 సం. మధ్య వయసు ఉండి చదువు ఆపేసిన లేదా చదువుకొని పెద్దలను గుర్తించి అక్షరాస్యతను అందించి వారికి ప్రాథమిక విద్య, డిజిటల్ విద్య, మరియు ఆర్థిక విద్యను వాలంటీర్ టీచర్ ద్వారా అందించడమే ఉల్లాస్ పథక లక్ష్యమని తెలిపారు. గత 2024,25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 23,170 మంది నిరక్షరాస్యులను లక్ష్యంగా నిర్దేశించుకోగా అందులో 87 ఉత్తీర్ణత సాధించామన్నారు. ప్రస్తుత 2025,26 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ, అర్బన్ ప్రాంతాలలోని నిరక్షరాస్యులను గుర్తించడానికి రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మందిని లక్ష్యంగా పెట్టుకోగా జిల్లాలో మొత్తం 1,01465 మంది నిరక్షరాస్యులను గుర్తించడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వచ్చే నెల ఆగస్టు 7వ తేదీ నుంచి ఫిబ్రవరి నెల వరకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, జీవన నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, నిరంతర విద్య వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఎంపీడీవోలు ఎంఈవోలు, మున్సిపల్ కమిషనర్, సిటీ మిషన్ మేనేజర్స్, మరియు అడల్ట్ ఎడ్యుకేషన్ సిబ్బందికి ఈ నెల 29వ తేదీన జిల్లా స్థాయి ట్రైనింగ్ ప్రోగ్రామ్ ను, ఆగస్టు మొదటి వారంలో వాలంటీర్స్ టీచర్స్ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్, క్లస్టర్ కోఆర్డినేటర్స్ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్స్, విలేజ్ వార్డ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు మండల స్థాయి ట్రైనింగ్ ప్రోగ్రామ్ ను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డిడి ఎం .వి సుబ్బారెడ్డి, ఐసిడిఎస్ పిడి శ్రీలక్ష్మి, డిఆర్డిఏ, డీఈఓ, జి ఎస్ డబ్ల్యూ ఎస్, డ్వామా, జిల్లా పరిషత్, మెప్మా, జిల్లా పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు

పులివెందుల ,జూలై 25 , ప్రభాత వార్త:

పులివెందుల తాలూకా పరిధిలోని వేముల మండలం కణం కింద కొట్టాల గ్రామ సమీపంలోని కదిరి ఘాట్ నందు వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో నేటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు హిందూ ఐక్యవేదిక తెలిపింది. గతంలో దీప దూప నైవిద్యాలతో విరాజిల్లిన రత్నాచల ఆంజనేయ స్వామి దేవస్థానం గత కొద్ది సంవత్సరాలుగా నిరాదరణ గురి కావడంతో దానికి తిరిగి పూర్వ వైభవం తేవడానికి హిందూ ఐక్యవేదిక రంగనాథ చారిటబుల్ ట్రస్ట్ వారు ముందుకు రావడం జరిగింది హిందూ ఐక్యవేదిక నాయకులు కొప్పల శ్రీనివాస్ రెడ్డి చదలవాడ శ్రీనివాసులు రంగనాథ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లం రంగనాయకులు కణంపల్లి సర్పంచ్ పాలెం రంగనాథ్ మాట్లాడుతూ రేపటి నుంచి ఐదు శనివారాలు అన్నదాన కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు ఆలయంలో నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అంతేకాక ప్రతి మంగళ, శని వారాలలో ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు ఆకు పూజలు చేయనున్నట్లు వెల్లడించారు. భక్తులు ఈ కార్యక్రమాలకు పెద్ద సంఖ్యల హాజరుకావాలని వారూ విజ్ఞప్తి చేశారు.

## షర్మిలారెడ్డిని కలిసిన ధ్రువకుమార్ రెడ్డి



వేంపల్లి: జూలై 25 (ప్రభాత వార్త):

ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డిని విజయవాడ లోని పార్టీ కార్యాలయంలో పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మూలంరెడ్డి. ధ్రువకుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గంలోని పలు సమస్యలపై వైఎస్ షర్మిలారెడ్డి తో నియోజకవర్గ ఇన్చార్జ్ ద్రవ కుమార్ రెడ్డి చర్చించారు. ముఖ్యంగా పులివెందుల మెడికల్ కాలేజీ, వేంపల్లిలో ఆగిపోయిన రోడ్డు నిర్మాణ పనులతో పాటు తదితర వాటిపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా ఆమె పలు సూచనలు చేసినట్లు తెలిసింది. నియోజకవర్గంలోని స్థానిక సమస్యలు పరిష్కారం కాకపోతే ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేక ద్వారా నియోజకవర్గ సమస్యలను తెలియజేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

రామాపురం: జూలై 25 (ప్రభాత వార్త):

కర్నూలు చిత్తూరు40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి సమీపంలో టోల్గేట్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పొంగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తిని అక్కడికక్కడే మృతి చెందినట్లు రామాపురం పోలీసులు తెలిపారు. స్థానికుల కథల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పుంగనూరు డిపోకు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ బస్సు కడప నుంచి పుంగనూరు కి వెళ్తుండగా మార్గమధ్యలోకి టోల్గేట్ సమీపానికి రాగానే గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతూ ఉండగా బస్సు ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు ఎక్కడ ఆగకుండా రాయచోటి బస్టాండ్ వద్ద ఉంచి రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్లో డ్రైవర్ అదుపులో ఉన్నట్లు సమాచారం తెలిసింది. మృతుడు వృద్ధుడు బిచ్చటన చేసేవాడని అక్కడ స్థానికులు తెలిపారు సార్. పూర్తి వివరాలు ఇంకా తెలియలేదు సార్. ఈ మేరకు రామాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాల్సి ఉంది.

## సూపరిపాలన తొలి అడుగు

సిద్ధవటం జూలై 25 ప్రభాతవా ర్త

జగన్ మోహన్ రాజుఆధ్వర్యంలో సిద్ధవటం మండలం టక్కోలు గ్రామ పంచాయతీలోని ఎస్‌సి కాలనీలో సూపరిపాలన తొలి అడుగు డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమం బుధవారం నిర్వహించబడింది. ప్రతి ఇంటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వం గత ఒక సంవత్సరం కాలంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రచారం చేయడమైనది ఈ సందర్భంగా పార్లమెంట్ కార్యదర్శి నాగముని రెడ్డి మాట్లాడుతూ, సూపరిపాలన అంటే ప్రజలకు చేరువైన పరిపాలన. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పనితీరు బలోపేతం అవుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నప రెడ్డి, సుబ్బయ్య, సుదీర్, ఆంజనేయులు, సంటయ్యా, ప్రసాద్ సహా టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటిలో తీవ్ర ఉద్యోగుల కొరత

### కుంటుపడుతున్న అభివృద్ధి పనులు... ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

**మదనపల్లె, జులై 25 ప్రభాతవార్త :**

జిల్లాలోని సెలక్షన్‌గ్రేడ్ మున్సిపాలిటిగా ఉన్న మదనపల్లె మున్సిపాలిటిలో ఉద్యోగుల కొరత కొట్టుమిట్టాడుతోంది. అభివృద్ధి పనులు వేగవంతానికి నోచుకోక కుంటుపడుతున్నాయి. మున్సిపాలిటిలో ప్రతి విభాగంలోనూ ఉద్యోగుల కొరత ఉంది. ముఖ్యంగా విభాగా హెచ్‌ఓడిల కొరత గత కొన్ని నెలలుగా ఉంటోంది. ప్రధానంగా రెవెన్యూశాఖకు సంబంధించి ఆర్‌ఓ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో ఇక్కడ ఆర్‌ఓగా ఉన్న ఉద్యోగి పదవీవిరమణ పొందడంతో గత రెండు నెలలుగా ఆర్‌ఓ ఫోస్టు భర్తీకి నోచుకోలేదు. రెవెన్యూశాఖలోని ఓ ఆర్‌ఐకి ఇన్‌చార్జ్ ఆర్‌ఓగా ఇచ్చారు. ఇక పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి టిపిఓగా ఉన్న జకీరా నగిరికి బదిలీ కావడంతో ఈ ఫోస్టు గత కొన్నాళ్ళుగా ఖాళీగా ఉంది. ఇక టిపిఎస్ ఫోస్టు ఖాళీగా ఉంది. టౌన్‌ప్లానింగ్‌లో ప్రధానమైన రెండు పోస్టులు ఖాళీగా ఉండడంతో ఏడిఎంగా ఉన్న బి.చిన్నరెడ్డమ్మకు ఇన్‌చార్జ్‌గా ఇచ్చారు. దీంతో టౌన్‌ప్లానింగ్‌కు సంబందించి పనులు సకాలంలో జరగక ధరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయ టౌన్‌ప్లానింగ్ సెక్రటరీల మీద అందరూ ఆధారపడుతున్నారు. వీరే టౌన్‌ప్లానింగ్ విభాగంలో ప్రధాన పాత్ర పోసిస్తున్నారు. ఇక సర్వేయర్‌ను కలికిరికి చెందిన ఉద్యోగిని ఇక్కడికి డిప్యుటేషన్ వేయడంతో అతను వారంలో మూడు రోజులు మాత్రం విధులకు వస్తున్నట్లు ఆశాఖ ఉద్యోగులు తెలిపారు. ఇంజనీరింగ్‌శాఖకు సంబంధించి ఇద్దరు డీఈలు ఉన్నా ఒక్క డిఈ నామమాత్రంగానే కార్యాలయంకు వచ్చి వెలుతుంటారు. ఉన్న ఒక్క మహిళా డిఈతో పనులు వేగవంతానికి నోచుకోవడం లేదు. ఏఈల కొరత కూడా తీవ్రంగా ఉంది. ఓ వైపు అభివృద్ధి పనులు వేగవంతం కాక చేసిన పనులకు సంబంధించి గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించక మున్సిపాలిటిలో అభివృద్ధి పనులు ఎక్కువుగా కుంటుపడుతున్నాయి. శానిటేషన్‌లో కూడా పనులు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. పట్టణంలో పారిశుద్ధ్య కార్మికుల కొరత కూడా ఎక్కువుగా ఉండడంలో పలుచోట్ల పారిశుద్ధ్య పనులు అంతంతమాత్రంగా జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలో సెలక్షన్‌గ్రేడ్ మున్సిపాలిటిగా ఉన్న మదనపల్లె మున్సిపాలిటిలో ఉద్యోగుల కొరత తీర్చాల్సిందిగా పలువురు కోరుతున్నారు.



## ఎమ్మెల్యేచే సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, జులై 25 ప్రభాతవార్త :**

పట్టణంలోని 13వ వార్డు మోతీనగర్ నందు గోఫినాథ్‌రావుకు మంజూరైన సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పంపిణీ చేశారు. ఆ వార్డు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్ ద్వారా ఎమ్మెల్యే బాధితునికి చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఓ వరంలాంటిందన్నారు. అనారోగ్యానికి గురైన వారు ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్సలు పొందేందుకు సిఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

## వ్యాధులకు దూరంగా ఉండండి

### హెల్త్ అసిస్టెంట్ గంగయ్యగౌడ్

**మదనపల్లె, జులై 25 ప్రభాతవార్త :**



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మలేరియా జ్వరాలకు దూరంగా ఉండాలంటూ హెల్త్ అసిస్టెంట్ గంగయ్యగౌడ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని దొంతి వీధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సొసైటి కాలనీ, రెడ్డీస్‌కాలనీ సచివాలయాల పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటా లార్వా సర్వే నిర్వహించి వ్యాధులకు దూరంగా ఉండాలని ప్రజలకు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలందరూ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ముఖ్యంగా లార్వా దోమలుగా మారి దోమల కుట్టడం వల్ల వచ్చే మలేరియా, డెంగ్యూ, చికన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి జ్వరాలు వస్తాయని ప్రతి ఇంటిముందు లార్వా లేకుండా చూసుకోవాలన్నారు. ఇంటిపరిసరాలను శుభ్రంగా ఉంచుకొని వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. స్వచ్ఛమైన నీరు తాగి చేతులను శుభ్రపరుచుకోవాలన్నారు. ఆరోగ్య సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు.

## జబ్బు ఒకటైతే వైద్యం మరొకటి

**పీలేరు జూలై 25 ప్రభాతవార్త:**



పీలేరు పట్టణంలో కనీస భవనాలు కనీస వసతులు లేకుండా అమాయకులైన పేద బడుగు బలహీన వర్గాలకు సంబంధించినటువంటి ప్రజలను వైద్య వృత్తికి కళంకం తెచ్చే విధంగా మభ్యపెడుతూ జబ్బు ఒకటైతే వైద్యం మరొకటి వచ్చిన జబ్బును కనుగొనాలనేటువంటి భయం ఉండాలని అభద్రతా భావాన్ని రోగికి కలిగించి అనవసరమైన సంబంధం లేనటువంటి వైద్య పరీక్షల పేరుతో వేలకు వేలు దండుకుంటూ ఒక ప్రైవేటు హాస్పిటల్లో అర్హత కలిగినటువంటి సిబ్బందిని నియమించుకోవాలనే నిబంధనలను కూడా పట్టించుకోకుండా పూర్తిగా వారు చదువుకి వారు చేస్తున్నటువంటి పనికి సంబంధం లేనటువంటి వ్యక్తులను తీసుకొచ్చి వైద్యాన్ని వ్యాపారంగా మారుస్తున్నారని అందులో భాగంగా గత ఆరు నెలలుగా పీలేరు పట్టణంలో అనేక హాస్పిటల్లో వైద్యాలు వికటించి రోగులు మరణించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ హాస్పిటల్ నందు కొంతమంది డాక్టర్లు వైద్యం కోసం వచ్చినటువంటి వారిని రెఫర్ పేరుతో వారికి అనుకూలమైనటువంటి హాస్పిటల్స్‌కు పంపించడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ హాస్పిటల్స్ జిల్లా స్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## డ్రోన్ పంపిణి

**చాపాడు. జూలై25. ప్రభాతవార్త :**



మండలంలోని రేపల్లె గ్రామం చియ్యపాడు రైతు సేవా కేంద్రం పరిధిలో ఏర్పాటు చేసిన శ్రీ దస్తగిరి స్వామి రైతు మిత్ర యూనిట్ సభ్యులకు శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 9,8 లక్షల విలువగల డ్రోన్ 80 సబ్సిడీతో రైతులకు అందజేసినట్లు వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కృష్ణమూర్తి, మండలం వ్యవసాయ అధికారిని శ్రీదేవి పద్మలత దేవిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రమణ, రైతులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ

**రామసముద్రం, జులై 25, ప్రభాతవార్త**



మండలంలోని చెంబకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో గఫూర్, మండల పరిపాలన అధికారి నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది సకాలంలో రోగులకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఆసుపత్రిలో రోగుల సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే దిన్నిపల్లె సమీపంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన బోధనను నేర్పించాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. మినికి గ్రామ పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛదివాస్ పై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గఫూర్, తాహశీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్, మండల పరిపాలన అధికారి నాగరాజు పంచాయతీ సెక్రటరీ రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ఆవశ్యకతను తెలుసుకోవాలి




రక్తదానం చేస్తున్న విద్యార్థులు

**రాజంపేట, జూలై 25 ప్రభాతవార్త**

కడప, అన్నమయ్య జిల్లా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్త వారోత్సవాల రెండో వార్షికోత్సవ వేడుకలో శుక్రవారం రాజంపేట స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో అమ్మ హెల్పింగ్ హాండ్స్ కువైట్, వికసిత ఫౌండేషన్, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. పురుషోత్తం, జేబీవీఎస్ వ్యవస్థాపకుడు అశోక్, రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశస్వి రెడ్డి, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ పురుషోత్తం మాట్లాడుతూ రక్తదానం యొక్క ఆవశ్యకతను తెలుసుకొని రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం వల్ల మంచి ఆరోగ్య లాభాలు ఉన్నాయని గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో మరో అతిథిగా పాల్గొన్న జేబీవీఎస్ వ్యవస్థాపకుడు ఎం అశోక్ మాట్లాడుతూ యువకులు రక్తదానం చేయడంపై అవగాహన లేకపోవడంతో రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం ఇబ్బంది పడుతుందని భ్రమ పడుతుంటారని కానీ రక్తం దానం చేయడం వల్ల పాత కణాలు శరీరం నుంచి పోయి కొత్త కణాలు రావడంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మరో అతిథిగా పాల్గొన్న డాక్టర్ యశస్వి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో చాలామంది మహిళలు కూడా పురుషుల కంటే చురుకుగా రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ డాక్టర్ బి రామకృష్ణ మాట్లాడుతూ వర్షాకాల ప్రభావం వల్ల చాలామంది అనారోగ్యపాలై రక్తం అవసరం పడుతుందని దీని దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛంద సంస్థలు మెగా రక్త వారోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వెంకట నరసయ్య, విమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ పార్వతి, కళాశాల ఉపాధ్యాయులు, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ స్టాఫ్ ప్రశాంతి, ఉషారాణి, సంస్థ సభ్యులు స్టీఫెన్, శ్వేత, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ చరిత్రను గుర్తించండి

**తంబళ్లపల్లె జూలై 25 ప్రభాతవార్త ః**



తంబళ్లపల్లె మండలం జుంజురపెంట పంచాయతీ పరిధిలోని నేరేడు కొండపై 700 సంవత్సరాల చరిత్ర కలిగిన నేరేడు కొండ్రాయ ఆలయ ప్రస్థానం తోపాటు మాన్యం భూములను కాపాడాలని నాలుగు పంచాయతీల నేరేడు కొండ్రాయ స్వామి భక్తులు తాసిల్దార్ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రియల్టర్ బండారు నాగరాజు సారధ్యంలో జుంజురపెంట, ఆర్ ఎన్ తాండ, కొటాల, పంచాయతీలకు చెందిన స్వామి వారి ఇలవేల్పు భక్తులు పూజలు నిర్వహిస్తున్నామని ఆలయానికి మాన్యం భూములు సైతం కలిగి ఉండి ఎండోమెంట్ పరిధిలోకి వచ్చిందని కొందరు ప్రసిద్ధి చెందిన నేరేడు కొండ్రాయ స్వామి ఆలయం పేరుతో మాన్యం భూములను ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని తాసిల్దారు శ్రీనివాసులకు ఫిర్యాదు చేయగా ఆయన స్పందించి ఎండోమెంట్ పరిధిలోని నేరేడు కొండ స్వామి అందరికీ దేవుడేనని ఆయన మాన్యం భూములను అన్యా క్రాంతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. చేతనైతే నేరేడు కొండ్రాయ స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని మాన్యం భూములను ఆక్రమించాలని చూస్తే సహించేది లేదని స్వామి భక్తులు విలేకరులకు తెలిపారు.

## రక్తదానం అనేది గొప్ప సామాజిక సేవ

**ప్రొద్దుటూరు అర్బన్, జూలై 25,ప్రభాతవార్త :**

ప్రొద్దుటూరు స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్త వారోత్సవాలు 2025, రెండవ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రక్తదాన శిబిరాన్ని స్థానిక నందిని క్లాత్ మార్కెట్ నందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ సమాజ బాధ్యతగా యువకులు రక్తదానాన్ని తీసుకోవడం మంచి పరిణామన్నారు. రక్తదానం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎందరినో కాపాడవచ్చు అని, దీనివల్ల ప్రతి ఒక్కరికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. డిప్యూటీ ఎమ్మార్వో అజయ్ బాబు, ఎన్టీఆర్ యూనివర్సిటీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని రక్తాన్ని రక్తదానం వల్ల మాత్రమే ఇతరులకు ఉపకారం చేయవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా రక్తదానానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో గవర్నమెంట్ హాస్పిటల్ సూపర్ సూపర్నెంట్, బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 71 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన స్వచ్ఛంద సంస్థలు అభినందించారు. కార్యక్రమంలో మహిళలు రక్తదానం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ డాక్టర్ నాగ శేఖర్ రెడ్డి బిపి,దయాబెటిక్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ శూలం లక్ష్మీదేవి, ఆదరణ స్వచ్ఛంద సంస్థ సత్యనారాయణ, సంస్కృతి సేవా సంస్థ ఒంటేరు శ్రీనివాసరెడ్డి, డాక్టర్ దిలీప్, శ్రీ శ్రీ హోలిస్టిక్ జనరల్ మేనేజర్ నరసింహా, విద్యార్థి ఫౌండేషన్ విజయభాస్కర్ రెడ్డి, వేములపాటి సూర్యనారాయణ రెడ్డి, ప్రాణదాత రాజు, సమాజ సేతు ఫౌండేషన్ రవీంధ్ర, ఆర్నాల్డ్ జిమ్ న్యామతుల్లా, డాక్టర్ మురుకుటి సూర్యనారాయణ రెడ్డి, ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఫ్రెండ్స్ ఉమర్, డివైఎఫ్ఐ విశ్వనాథ్, మదర్ తెరిసా సేవా వృద్ధాశ్రమం రాజేష్, జనవిజ్ఞాన వేదిక తవ్వ సురేష్, సునీత, మధుసూదన్ రెడ్డి, మహిత, వీరయ్య, రాజ్యలక్ష్మి, వివేకానంద ఫౌండేషన్ రామకృష్ణారెడ్డి, ఎస్ఎఫ్ఐ రాహుల్, అజయ్, సిఐటియు సత్యనారాయణ, విజయ్ కుమార్, రాఘవ, భగత్ సింగ్ బ్లడ్ డొనేషన్ గ్రూప్ డేవిడ్, స్నేహ సేవా సమితి మధు, వాత్సల్య చారిటబుల్ ట్రస్ట్ సలీం, మై స్పేస్ టైక్వాండో సలీం, సి ఎ సురేష్ కుమార్ రెడ్డి, సృజన శ్రీను, పౌర హక్కుల సంఘం వెంకటేష్, గవర్నమెంట్ హాస్పిటల్ ప్రసాద్ రెడ్డి, అమృత పాల్గొన్నారు.



## గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరించండి



**ప్రొద్దుటూరు జూలై 25 ప్రభాతవార్త**

మండలంలో గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయవలసిన బాధ్యత మనందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కొర్రపాడు రోడ్డులోని టిఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ మండల స్థాయి నాయకుల కార్యకర్తల ప్రజా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో పాటు మరిన్ని హామీలు ప్రజలకు ఇచ్చి గద్దెనెక్కారన్నారు. వాటితో జగన్ పాలనకు, చంద్రబాబు పాలనకు వ్యత్యాసాన్ని ప్రజలకు తెలపాలని సూచించారు. గడచిన ఏడాది పాలనలో చంద్రబాబు సూపర్ సిక్స్ అమలులో విఫలమయ్యారని ఫించన్ల పెంపు, తల్లికి వందనం, 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అరకొరగా అందించడం తప్ప అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, మహాశక్తి, 50 ఏండ్లు నిండిన వారికి పింఛన్లు, మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం జిల్లా పరిధి13 నెలల్లో కొత్త పెన్షన్లను మంజూరు ఊసే లేదని విమర్శించారు. అక్రమ కేసులు నమోదు చేసి మూడు నెలలు జైలుకు పంపినంత మాత్రాన ప్రజా పోరాటం చేయడంలోనూ జగన్ ముఖ్యమంత్రి గా చేయడంలోనూ మరింత ముందుకు వెళతామే కానీ వెనక్కు వెళతామా అని ప్రశ్నించారు. భవిష్యత్తులో అధికారం తమదే అని, తాను మంత్రి అవుతానని వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు నాగేంద్ర రెడ్డి, ఎంపిపి శేఖర్ యాదవ్, సోములవారిపల్లె సర్పంచ్ మోపురి ప్రశాంతి వైసీపీ నాయకులు గంజికుంట శివారెడ్డి దేవి శ్రీ ప్రసాద్ రెడ్డి బీరం రాఘవేంద్రారెడ్డి నల్లదేసి జంగమయ్య మరియు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి

**రామాపురం, జూలై 25 ప్రభాతవార్త**



కౌమార దశ బాలికల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని హెల్త్ కౌన్సిల్ రవీంద్రబాబు ఏంఎల్‌హెచ్‌పి ప్రవీణ పేర్కొన్నారు. మండలంలోని కుమ్మరపల్లి జడ్పీ హైస్కూల్ లో శుక్రవారం కౌమార దశ బాలికల నెలవారే వ్యక్తిగత పరిశుభ్రత అవలోహనం అనే అంశంపై అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు సందర్భంగా వారు మాట్లాడుతూ కౌమార దశ ( కిశోర బాలికలు)7వ తరగతి నుండి పదవ తరగతి ఇంటర్మీడియట్ బాలికలు గ్రామీణ ప్రాంతాలలో వ్యక్తిగత నెలవారీ పరిశుభ్రతపై అవగాహన కిషోర్ బాలికలకు ప్రతినెల 10నాప్కిన్లు ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేస్తాం న్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు ఆరోగ్య సిబ్బంది కౌమార దశ( కిషోర బాలికలు ) బాలికలు పాల్గొన్నారు.

## కస్తూరిబా పాఠశాల. పిహెచ్‌సిని పరిశీలన

**చిన్నమండెం జూలై 25 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని కస్తూరిబా బాలికల పాఠశాల, చాకీబండ పిహెచ్‌సి, దేవగుడిపల్లి డంపింగ్ యార్డును శుక్రవారం మండల స్పెషలాఫీసర్. సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా కస్తూరిబా బాలికల పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యంగా ఉండాలని అలాగే మెనూ ప్రకారం వడ్డించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం,రికార్డులు పరిశీలించి తగిన సలహాలిచ్చారు. అలాగే చాకీబండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లో తనికి చేసారు. దేవగుడిపల్లి డంపింగ్ యార్డు కు చెత్తను తరలించి అక్కడ చెత్తనుండి సంపద తేవాలను అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా బాలికల ప్రిన్సిపాల్ అరుణ, పంచాయతీ కార్యదర్శి సుమిత్రమ్మ,వైద్య అధికారులు పాల్గొన్నారు.

## కడప పర్యటనను విజయవంతం చేస్తాం..

**కడప కార్పొరేషన్ జూలై 25 ప్రభాతవార్త:**



ఈ నెల 27 బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షులు పీవీఎస్.మాధవ్ కడప పర్యటనకు రానున్నారని బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బిజెవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, బీజేవైఎం జాతీయ నాయకులు బత్తల పవన్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం కడప బిజెపి కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మొదటిసారి కడప పర్యటనకు విచ్చేస్తున్నారు. తొలుత తిరుమల తొలి కడప దేవుని కడపలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం కడప వై జంక్షన్ నుంచి ఆదిత్య కల్యాణమండపం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అక్కడ జరిగే సమావేశంలో పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమం లో బీజేవైఎం జాతీయ నాయకులు పవన్, బీజేవైఎం నాయకులు సురేంద్ర, ప్రవీణ్, అశోక్ కుమార్ రెడ్డి, పృథ్వి నారాయణ, దశరథ, వాజపేయ్, ప్రవీణ్, శ్రీకాంత్, సాయి, చాగలమర్రి ఓబులేసు పాల్గొన్నారు.

## పాత బకాయిలు చెల్లించాలి




పెంచలయ్యతో కళాబృందాల నాయకులు

**పీలేరు జూలై 25 ప్రభాతవార్త :**

కళాకారులకు అందాల్సిన పాత బకాయిలు చెల్లించి ఆదుకోవాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు ధన్యాసి పెంచలయ్యను కళాకారులు కోరారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల కళాబృందాల నాయకులు, సమన్వయకర్తలు శుక్రవారం విజయవాడ ఘంటసాల ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణంలోని సాంస్కృతిక శాఖ కార్యాలయంలో వారు సహాయ సంచాలకుని కలసి తమ సమస్యలను నివేదించుకున్నారు. 2018,19 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ద్వారా నిర్వహించిన జన్మభూమి మన ఊరు, గ్రామదర్శిని కార్యక్రమాల్లో కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి అందాల్సిన బకాయిలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసుకున్నారు. అందుకు స్పందించిన సహాయ సంచాలకులు వీలైనంత త్వరగా బకాయయి సొమ్ము అందేటట్లు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల సమన్వయకర్తలు ప్రవీణ్, తరిమిళ్ల రాజు, టింగ్ టింగ్ వెంకటేష్, కళాబృందాల నాయకులు ఖాదర్ బాషషేక్, కలకట రెడ్డెప్ప, ఆదినారాయణ, కళాబృందాల నాయకులు పాల్గొన్నారు.

## శ్రావణ శనివారాలకు ముస్తాబు

**రామసముద్రం, జులై 25, ప్రభాతవార్త**

ఊలపాడు గ్రామపంచాయతీ, దిన్నిపల్లి గ్రామ సమీపంలో మోరు కొండలో గౌతమముని మహర్షి తపస్సు చేసిన ప్రదేశంలో వెలసిన శ్రీ గవితిమ్మరాయ స్వామి దేవాలయంలో స్వామివారి నక్షత్రం అయిన శ్రావణా నక్షత్రం అని పిలువ బడే శ్రావణమాసంలో 4శనివారాలు స్వామివారు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు అందుకుంటారు. నేడు తొలి శనివారం ఈ సందర్భంగా కనగాని గ్రామానికి చెందిన సర్పంచ్ రుక్మిణమ్మ, వైసిపి స్టేట్ జనరల్ సెక్రెటరీ గెవన్న విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు.

## 65సంవత్సరాలుపై బడిన వారికి ఇంటివద్దకే రేషన్

**రామాపురం జూలై 25. ప్రభాతవార్త**



మండల తాసిల్దార్ వెంకటేశ్వర్లు అన్నమయ్య జిల్లా రామాపురం మండలం రామాపురంలో ఈ రోజు జరిగిన మండల డీలర్ల సమావేశంలో మండల తాసిల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ26 తారీకు నుండి65 సంవత్సరాలు పైబడిన వారికి వారి ఇంటి వద్దకే రేషన్ సప్లై చేయాలని డీలర్లకు తెలియచేశారు. డీలర్లు ఒకటవ తారీకు నుండి ఏడవ తారీకు వరకు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు రేషన్ ఇవ్వవలెనని ఆదేశించారు. డీలర్లు రేషన్ గోడౌన్ దగ్గరకు వెళ్లి తూకాలు సరిచూసుకొని సరుకు తెచ్చిన వెంటనే ఫింగర్ వేసి స్టాకులు డౌన్లోడ్ చేసుకోవలెనాని సూచించారు. ఈ సమావేశంలో మండల తాసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎన్ఫోర్స్మెంట్ తాసిల్దార్ వెంకటరెడ్డి ,డిప్యూటీ తాసిల్దార్ కృపావతి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సమద్ ఖాన్. మరియు మండల డీలర్లు పాల్గొన్నారు.

## రైతులకు అదునులో ఎరువులు అందడం లేదు

**మైదుకూరు, జులై 25, ప్రభాతవార్త:**




వైఎస్ఆర్సిపి పార్టీ ఆఫీసులో మాజీ ఎమ్మెల్యే రఘురామి రెడ్డి మాట్లాడుతూ రైతులకు అదునులో ఎరువులు అందడం లేదని నియోజకవర్గంలోని ఏ మండలానికి వెళ్లిన రైతులు అడుగుతున్నారని తెలిపారు. అయితే బ్రాందీ షాపులు మాత్రం ఉదయం 8 గంటలకే వ్యాపారాలు సాగుతున్నాయని ఆరోపించారు. మీడియా ముందు నేను చేసిన ఆరోపణలకు సరైన సమాధానం చెప్పలేదంటే వాటికి వాళ్ళు ఒప్పుకున్నట్లేనా అంతేకాకుండా సంబంధం లేని వారు మాట్లాడితే అవి సమాధానం ఎలా అవుతుంది. మాట్లాడాల్సిన వారు మీడియా ముందు సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న,మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్,వైఎస్ఆర్సిపి మున్సిపల్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ ఎంఆర్ఎఫ్ సుబ్బయ్య, వైస్ ఎంపీపీ రఘురామి రెడ్డి, మండల ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, కో ఆప్షన్ ట్రాక్టర్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

## మొన్న గొల్లపల్లె నేడు కృష్ణాపురం, భూమాయపల్లి

**మైదుకూరు, జులై 25, ప్రభాతవార్త:**



కేబుల్ వైర్లు దొంగతనంలో రైతులకు తీవ్ర నష్టం దొంగలురాత్రికి రాత్రి పొలాల్లోని 15 బోర్ల వద్ద స్టార్టర్ కేబుల్ లను దొంగతనం చేసిన దొంగలు. గుంపులు గుంపులుగా ఊర్ల మీద పడి కేబుల్ వైర్లను దొంగతనం చేస్తున్న దొంగల ముటా మైదుకూరు మున్సిపాలిటీ, కృష్ణాపురం భూమయ్యపల్లె, గ్రామంలో గురువారం రాత్రి పెద్ద సంఖ్యలో దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. పొలాల్లో పంటకు నీరు పెట్టుకునే సమయంలో స్టార్టర్ వద్ద కేబుల్ లను కట్ చేసి ఎత్తుకుపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులకు నష్టం కలిగించేలా దొంగతనానికి పాల్పడుతున్న దొంగల ముఠాను శిక్షించాలని. రైతులు పోలీసులను అభ్యర్థిస్తున్నారు.

## రైతు భరోసా కేంద్రం నందు కందుల పంపిణీ

**తొండూరు జూలై 25 ప్రభాతవార్త:**



స్థానిక తొండూరు గ్రామం నందు రైతు భరోసా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా కందులు పంపిణీ చేయడం జరుగుతున్నది తొండూరు గ్రామ పంచాయితీకి 40 క్వింటాళ్ల కందులను ఇవ్వటం జరిగింది అని మండల వ్యవసాయ అధికారి కే. రాజు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు వీటిని రైతులకు ఉచితంగా పంపిణీ చేయుచున్నారు. రైతు యొక్క ఆధార్ కార్డు ,పట్టా పాస్ బుక్ జిరాక్స్ ను తీసుకొని రైతు భరోసా కేంద్రం నకు రావాలని కందుల యొక్క రకము లిఖిబి 105 ప్రతి ఒక్క రైతుకు ఒక పట్టా పాస్ బుక్ కు నాలుగు కేజీల ప్యాకెట్ ఒకటి చొప్పున పంపిణీ చేయడం జరుగుతున్నది. ఇప్పటివరకు 15 క్వింటాళ్ల పంపిణీ జరిగింది మిగిలిన 25 క్వింటాల కందులను సోమవారం నాడు పంపిణీ చేయడం జరుగుతుందని ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

## అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిల్ స్వాధీనం

**ముద్దనూరు. జూలై 25. ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు జిల్లా కార్యాలయానికి ఫిర్యాదులు అందడంతో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎస్సై మైనుద్దీన్ తోటి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న రామాంజనేయులు, మనోహర్ ఇరువురు వ్యక్తుల నుంచి 14 మద్యం బాటిల్ స్వాధీనం చేసుకుని ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మైనుద్దీన్ తెలిపారు. ఎవరైనా అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని సందర్భంగా హెచ్చరించారు.

## చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో

**ముద్దనూరు. జూలై 25. ప్రభాతవార్త:**



గ్రామపంచాయతీ పరిధిలోని డీఎన్ పల్లె సమీపంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో రాధాకృష్ణ వేణి శుక్రవారం పరిశీలించి సంపద తయారీ కేంద్రంలోని బెడ్స్ లలో వానపాములను వదిలారు. పంచాయతీ సిబ్బంది తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి దాని ద్వారా వర్మి కంపోస్ట్ ఉత్పత్తిపై సిబ్బందికి తగు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చని బాబు సర్కార్..




**కడప కార్పొరేషన్, జులై 25 ప్రభాతవార్త:**

రైతులకు ఇస్తా అన్న రూ.20 వేలు, ఆడబిడ్డలకు నెలకు రూ.1500, ఆడబిడ్డలకు ఉచిత బస్, ఇంటి ఇంటికి ఒక ఉద్యోగం, నిరుద్యోగులకు నెల రూ.3000లు, 50 సంవత్సరాలు దాటిన యస్.సి, యస్.టి, బి.సి మైనారిటీ లకు ఇస్తా అన్న పెన్షన్ వంటి పథకాల అమలు చేయలేదని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సతీష్ కుమార్ రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షంలో ఉండి వీటిపై విమర్శిస్తే నాపై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం కడప వైసీపీ కార్యాలయంలో మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష, కడప నగర మేయర్ సురేష్ బాబు లతో కలిసి సతీష్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జగన్ హయాంలో లక్ష కోట్లు అవినీతి జరిగిందన్నారు.. కాని లిక్కర్ కేసు చివరికి రూ.3500 కోట్లకు అంటున్నారన్నారు. ఆధారాలు లేకుండా ఒక కట్టు కథ అల్లి కేసులు కట్టారని విమర్శించారు. జగన్ బ్రాండ్స్ అన్నావు..అవన్నీ బాబు హయాంలోనే అనుమతులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అంజాద్ భాష, మేయర్ సురేష్ బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, ప్రసాద్ రెడ్డి, రెడ్డి వెంకటసుబ్బారెడ్డి, యానాదయ్య, పాల్గొన్నారు.

# జానకి రాముల ప్రియ శిష్యుడు గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయులు

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి.... ఈ ఏడాది ఐదు శ్రావణ శనివారాలు.





**వేంపల్లి: జూలై 25 ప్రభాతవార్త :**
శ్రావణమాసం అంటే ఆంజనేయుడికి ఎంతో ప్రీతికరం అలాగే ఆయన భక్తులకు ఈనెల అంటే ఎంతో ఇష్టం శ్రావణమాసం వచ్చిందంటే ఆంజనేయుడికి గుళ్ళు ప్రత్యేకత అలంకరణకు నోచుకుంటాయి ఎక్కడ చూసినా భక్తులతో కితకిత లాడుతాయి అయితే రాయలసీమ జిల్లాలలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయ స్వయంగా రాముడు చెక్కిన శిల్పం కావడం ఆయన ప్రతిష్టించిన ఇచ్చిన. విగ్రహం కావడంతో భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తుంటారు అలాంటి ఆలయ చరిత్ర కథలుగా చెబుతున్న విషయాన్ని ఒకసారి పరిశీలిస్తాం. రావణ సంహారణ తరం సీత సమేతుడై నా శ్రీరామచంద్ర మూర్తి తిరిగి అయోధ్య వెళ్లి సమయాన గండి క్షేత్రానికి వచ్చి సరికి చీకటి కావడంతో ఆ రాత్రి గండి క్షేత్రంలో శ్రీరామచంద్రుడు బస చేశాడట ఈ సమయంలో కొండకు కనిపించిన పెద్ద రాయిని చూసి సీతకు అక్కడ తెల్లవారు జామున శుభ ఘడియలు ముగిసే లోపు ఆంజనేయుడి విగ్రహాన్ని బాణపు ములికితో చెప్పాలని కోరిందట దీంతో శ్రీరాముడు ఆమె కోరిక మేరకు ఆంజనేయుడు విగ్రహాన్ని చెక్కడం ప్రారంభించాడు శుభ ఘడియలు ముగిసే సరికి ఎడమ చేయి చిటికెన వేలు మాత్రం కొదవ పడడంతో ఆ ప్రయత్నం అంతటితో ఆపేసి విగ్రహాన్ని ప్రతిష్ట పచేశారు అనంతరం పూర్వికులు భిన్నంగా ఉన్న విగ్రహాన్ని పూజలకు పనికిరాదని భావించి చిటికెన వేలునిఉలి చెప్పడంతో ఆ దెబ్బకు ఆ చోటి నుండి రక్తం రావడంతో భయపడి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. సీతాదేవి ఆంజనేయుడిని చిరంజీవిగా వర్ధిల్లాలి అని ఆశీర్వదించినట్లుగా ఆయన ఇక్కడ ప్రాణంతో ఉన్న ఆంజనేయులు విగ్రహం అని తెలపడం జరిగింది అప్పటినుండి భక్తులు అంజన్నకు పూజలు భక్తిశ్రద్ధతో చేసుకుంటూ ఉంటున్నారు అలాగే గండిలో సీత సమేతంగా విచ్చేస్తున్న రాముడికి స్వాగతం పలికేందుకు గండిలో తపస్సు చేసుకున్నటువంటి వాయుదేవుడు రెండు కొండల మధ్య బంగారు తోరణం నిర్మించి వారికి స్వాగతం పలికారు. ఆ బంగారు తోరణం నేటికీ కూడా ఉందని భక్తుల నమ్మకం పుణ్యాత్ములకు మాత్రమే ఈ తోరణం కనిపిస్తుందని ఇప్పటివరకు ఆ తోరణం ఇద్దరికీ మాత్రమే కనిపించిందట వారిలో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంగా ఉన్న సమయంలో జిల్లా కలెక్టర్ గా ఉండిన సర్ థామస్ మన్రో ఒకరు కాగా గండి భూమానంద ఆశ్రమంలో పీఠాధిపతి రామానంద స్వామికి మరొకరంట.

### గండికి పేరు ఎలా వచ్చిందంటే.

గండిలో ఉన్న కొండలను శేషాచల కొండలుగా అంటారు ఇవి తిరుమల నుండి గండి వరకు మధ్యలో ఎక్కే గాని తెగవు లేకుండా ఉన్నాయని అలాంటి ఈ శేషాచల కొండలు పాపాఘ్ని నది మధ్యలో గండి పెట్టింది దీంతో ఈ ప్రాంతానికి గండి అనే పేరు వచ్చిందట ఇక్కడ వెలిసిన ఆంజనేయస్వామి గుడికి గండి వీరాంజనేయ దేవస్థానం గండి అని పిలవడం జరుగుతుంది. పాపకి నది ప్రాంతంలో వెలసిన దర్శనియ స్థలాలు వీరాంజనేయ స్వామి దేవస్థానం నందు పాపాఘ్ని నది లో పుణ్య స్థానాలు చేస్తే పాపాలు పోతాయని పూర్వీకులు చెబుతుంటారు అలాగే పాపాఘ్ని తీర ప్రాంతంలో భక్తులకు దర్శించుకునేందుకు మరికొన్ని దేవస్థానాలు కూడా ఉన్నాయి. ఈ ఏడాది శ్రావణ మాసం ఉత్స వాలు ఐదు వారాలు రావడం విశేషం మొదటి శనివారం 26 7 2025 రెండవ శనివారం 2 8. 2025. మూడవ 9 8 2025. నాలుగవ 16. 8 2025. ఐదవ 23. 8 2025. వారాలలో ఈ ఉత్స వాలు ఘనంగా జరుగుతాయని ఆలయ అధికారులు తెలుపుతున్నారు.

### అన్ని ఏర్పాట్లు కండిక్షేత్రంలో పూర్తి.



26 నుండి జరుగునున్న శ్రావణ మాస ఉత్సవాలుకు గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం నందు అన్ని ఏర్పాట్లు పూర్తిగా చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె వెంకటసుబ్బయ్య గండి చైర్మన్ కావలి కృష్ణ తేజ చెప్పారు.

# ఆలయ ధర్మకర్తల నియామక విషయంలో కుల వివక్షకు తావులేదు

(దేవుని ముందు అందరూ సమానులే-ప్రత్యేక కులాల నుండి నియమించాలన్న పిటీషన్‌ను కొట్టివేసిన మద్రాసు హైకోర్టు)

**బద్వేలు లీగల్, జూలై 25 ప్రభాతవార్త :**
దేవుని ముందు అందరూ సమానులే కాబట్టి కుల వివక్షకు తావులేదని ప్రత్యేక కులాల నుండి ఆలయ ధర్మకర్తను నియమించాలన్న నిబంధన ఏదీ లేదని మద్రాసు హైకోర్టు ధర్మాసనం ఓ పిటీషన్‌ను త్రోసిపుచ్చింది. ఒక ప్రత్యేక కులానికి చెందిన వ్యక్తులను మాత్రమే ఆలయ ట్రస్టీలుగా నియమించాలని ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటీషన్‌ను జస్టిస్ భరత చక్రవర్తి ధర్మాసనం త్రోసిపుచ్చింది. తీర్పు వెలువరించే సందర్భంగా డా॥ బి.ఆర్.అంబేద్కర్, స్వామి వివేకానంద మాటలను ధర్మాసనం ఉటంకిస్తూ "ఆత్మకు లింగము, కులము" అనేది ఉండదని తెలుపుతూ కులం అనేది మనసులో మాత్రమే ఉందనిన్నీ భౌతికంగా ఏ రూపంలోనూ లేదనిన్నీ కూడా పేర్కొనింది. కులం అనేది మత సంబంధితమైన అంశం కాదనిన్నీ ఏ కులమైనా ఆలయ పరిపాలనపై ప్రత్యేక హక్కు కలిగి ఉండదనిన్నీ ధర్మాసనం సుస్పష్టం చేసింది. భారత రాజ్యాంగం సమానత్వంను ప్రోత్సహిస్తూ కుల ఆధారిత వివక్షతను వ్యతిరేకిస్తుందనిన్నీ తెలుపుతూ ప్రత్యేక కులాల నుండి ఆలయ ధర్మకర్తను నియమించాలన్న పిటీషన్‌ను త్రోసిపుచ్చుతూ మద్రాసు హై కోర్టు ఈ తీర్పును వెలువరించింది. (కె.వి.వేణుగోపాల్ ఎదిరి సెక్రటరీ టు గవర్నమెంట్ ఆఫ్ తమిళనాడు డబ్ల్యుపి నెం.15257/2025)

# దాతల సాయం పలువురికి ఆదర్శనీ యం

**పీలేరు జూలై 25 ప్రభాతవార్త :**
దాతల సాయం పలువురికి ఆదర్శనీయం మరియు అభినందనీయమని ఎంఈవో పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురం, దుబ్బ హరిజనవాడ, శివరామపురం ప్రాథమిక పాఠశాలల్లో ఏబీసీ సొసైటీ ఆధ్వర్యంలో దాతలు సుమలత. వారి తండ్రి డీసీసీ బ్యాంకు అప్రైజర్ రాజేంద్రాచారి విద్యార్థులకు విద్యాసామాగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో గత పది సంత్సరాలు రాజేంద్రచారి కుటుంబం పేద విద్యార్థులకు చేయూతనిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రేణుక, సీఆర్పీలు. విద్యార్థులు పాల్గొన్నారు.



## సిఎం స్ఫూర్తితో...
# దత్తత తీసుకున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్



**రాజంపేట, జూలై 25 ప్రభాతవార్త**
పి 4 పథకంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో చెరో 10 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. దత్తత తీసుకొన్న ఆ బంగారుకుటుంబాలకుమార్గదర్శమవ్వాలనినిర్ణయించుకున్నారు. శుక్రవారం రాష్ట్ర రాజధాని అమరావతి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు జిల్లా కలెక్టర్లు, ఇతర ప్రజా ప్రతినిధులతో పి 4 కార్యక్రమం పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మాట్లాడుతూ 2029 నాటికి ఆంధ్ర ప్రదేశ్ లో పేదరికం ఉండకుండా చేసేందుకు పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్షిప్ (పి 4) కార్యక్రమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు.ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లుగా చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమం భారతదేశానికే కాకుండా ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగాఖీ నేనుమార్గదర్శి ఖీ అనే ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పి4 కార్యక్రమంలో సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగునున్న 20 శాతం మందిని దత్తత తీసుకొని వారి అభ్యున్నతికి పాటుపడనున్నారు. ఆర్థిక సహాయం చేయలేని వారు మాట సాయం లేదా చదువు చెప్పించడం లేదా అవకాశాలను చూపించడం ద్వారా బంగారు కుటుంబాలకు చేయూతనివ్వచ్చని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలోని జిల్లా అధికారులందరూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని సిపిఓ కు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదనరావు, సిపిఓ వెంకట్, డొనేట్ కార్ట్ సీఈవో అనిల్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యేను సన్మానించిన జంగమయ్య

**ప్రొద్దుటూరు జూలై 25 ప్రభాతవార్త**
ప్రొద్దుటూరు మండలం వైసీపీ బీసీ సెల్ మండల ఉపాధ్యక్షులు నల్లదేసి జంగమయ్య మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డిని శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నల్లదేసి జంగమయ్య మాట్లాడుతూ వైసిపి బీసీ సెల్ ప్రొద్దుటూరు మండల ఉపాధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి స్థానిక మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్థానిక టిఎస్ఆర్ కళ్యాణ మండపంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ అనే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాచమల్లు శివప్రసాద్ రెడ్డిని నేరుగా కలుసుకొని శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. తన మీద ఎంతో నమ్మకంతో బిసి సెల్ మండల ఉపాధ్యక్షులుగా ప్రొద్దుటూరు మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తారని ఆయన హామీ ఇచ్చారు.



# గ్రామాల్లో వందశాతం చెత్త సేకరణ జరగాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**మదనపల్లె, జులై 25 ప్రభాతవార్త :**
గ్రామాల్లో వందశాతం చెత్త సేకరణ జరగాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. శుక్రవారం మొలకలచెరువు మండలం వేపూరికోటలోని వ్యర్థ పదార్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యర్థ పదార్థాల ప్రాసెసింగ్ కేంద్రంలోకి తడి, పొడి చెత్తలను వేరు చేసి తీసుకురావాలన్నారు. గ్రామ పంచాయితీలోని అన్ని కుటుంబాల నుండి చెత్త సేకరణ జరగాలని పంచాయితీ సెక్రటరీని ఆదేశించారు. గ్రామ పంచాయితీ పరిధిలోని అన్ని కుటుంబాల నుండి చెత్త సేకరణ జరిగేందుకు అవసరమయ్యే గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసుకోవాలని, ఖాళీలు ఉంటే వాటిని వెంటనే భర్తీ చేసుకోవాలన్నారు. వందశాతం చెత్త సేకరణ జరగకపోతే సంబంధిత వారిపై చర్యలు ఉంటాయన్నారు. అనంతరం వేపూరికోట గ్రామానికి సంబంధించి పిజిఆర్ఎస్ ద్వారా అర్జీపై వచ్చిన గ్రామాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రత్నమ్మ అందజేసిన అర్జీని పరిశీలించి తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు సూచించారు. కలెక్టర్ వెంట తనిఖీల్లో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, మొలకలచెరువు తహశీల్దార్, ఎంపిడిఓ పాల్గొన్నారు.

# సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నాము

**గాలివీడు, జులై 25 (ప్రభాతవార్త):**
సోలార్‌లో పనిచేస్తున్న సిబ్బందికి క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిఇస్తున్నామని జూన్ మాసానికి సంబంధించి మాత్రం పది రోజులు ఆలస్యం అయిందని తూముకుంట టాటా సోలార్ కంపెనీ స్టార్ క్యూబెక్స్ సెక్యూరిటీ ఎండి వినోద్, రీజనల్ మేనేజర్ భాస్కర్ వివరణ ఇచ్చారు.

# గండికి చేరుకున్న యర్రగుంట్ల మహా పాదయాత్ర

**యర్రగుంట్ల జులై 25 ప్రభాతవార్త**
శ్రావణ మాసం మొదటి వారం పురస్కరించుకొని ఎర్రగుంట్ల పట్టణం నుంచి తిరుపతి పాదయాత్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గండి మహా పాదయాత్ర సాయంత్రానికి పాదయాత్ర బృందం గండికి చేరుకుంది. తెల్లవారుజామున 5 గంటలకు ఎర్రగుంట్ల పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న క్రాంతి నగర్ లోని శ్రీ రామాలయం వద్ద నుంచి గండి మహా పాదయాత్ర ప్రారంభమైంది .ఈ పాదయాత్రలో సుమారు 300 మంది పైగా భక్తజనాలు పాల్గొన్నారు. పాదయాత్రలో పాల్గొన్న భక్తులందరికీ అన్ని మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు తిరుపతి పాదయాత్ర సేవాసమితి వారు దగ్గరుండి నిర్వహించారు. ఉదయము కడప రోడ్డు నుండి కోలాటం భక్తి కీర్తనలతో చెక్కభజనలతో పాదయాత్ర ప్రారంభమై వేంపల్లి రోడ్డు వరకు సాగి అక్కడి నుంచి భక్తులు పాదయాత్రను దిగ్విజయంగా నిర్వహించారు. పాలగిరి క్రాస్ రోడ్డు వద్ద మధ్యాహ్నం భక్తులకు కాశీనాయన దేవస్థానం వద్ద దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయము పెద్దనపాడు గ్రామంలో ఎల్‌జీఆర్ కుటుంబీకులు పాదయాత్ర భక్తులకు టిఫిన్ సదుపాయం అందించారు. అనంతరం అక్కడి నుంచి ప్రారంభమైన పాదయాత్ర వేంపల్లి పట్టణంలో క్రాస్ రోడ్డు నుంచి భక్తి కీర్తనలతో చెక్క భజనలతో పాదయాత్ర ప్రారంభమైంది. పాదయాత్రలో భక్తులందరికీ వేంపల్లె నుంచి గండికి పోయే మార్గ మధ్యంలో ఓ పెట్రోల్ బంకులో దాతలు రాత్రి డిన్నర్‌ని అందించారు. పాదయాత్రలో మహిళా భక్తులకు తిరుపతి పాదయాత్ర సేవా సమితి వారు ప్రత్యేక సదుపాయాలను అందించారు.





# ఏపీ ఎన్జీవోస్ ఆధ్వర్యంలో రేపు ఉచిత వైద్య శిబిరం

**ప్రొద్దుటూరు అర్బన్, జూలై 25 ప్రభాతవార్త:**
ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజీవ్ సర్కిల్లోని ఎన్జీవో బిల్డింగ్ ప్రాంగణంలో హోలీ స్టిక్ ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని ఎన్జీవో ప్రెసిడెంట్ కేజే రఘురాంరెడ్డి, కార్యదర్శి జే రామసుబ్బయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీ ఆదివారం ఉదయం 8 గం. నుండి 12.30 వరకు అందించే ఉచిత వైద్య సేవలో బిపి, షుగర్, ఈసీజీ, డాక్టర్ సలహా మేరకు 2డి ఎకో, బిఎంఐ వంటి ఉచిత పరీక్షలో చేస్తారని, ఆరోగ్య చిట్కాలు, గుండె సమస్యలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ శిబిరానికి వచ్చేవారు ఖచ్చితమైన షుగర్ స్థాయిలో కోసం ఉపవాసంతో రావాలని, మెరుగైన ఆరోగ్య అవగాహన మరియు సంరక్షణ కోసం ప్రొద్దుటూరు తాలూకా పరిధిలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఈ గొప్ప అవకాశము ను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# మానవతా ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులు.

**చిట్వేలి, జూలై 25, ప్రభాతవార్త:**
చిట్వేలి మానవతా శాఖ ఆధ్వర్యంలో 2024, 25 విద్యా సంవత్సరానికి 10వ తరగతిలో ప్రతిభను చాటిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల పిల్లలకు శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ఉన్నత పాఠశాల నందు ప్రతిభ అవార్డులను అందించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల 579 మార్కులు పొందిన లక్ష్మీ త్రివేణికి 6000 రూపాయలు, 572 మార్కులతో ద్వితీయ స్థానం పొందిన రెడ్డి నిత్యకు 4000 నగదును,571 మార్కులు పొందిన శివదీక్షతకు 2000 నగదును అందించారు. ప్రైవేటు పాఠశాలల నుంచి 593 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచిన శ్రీ సాయి వికాస్ విద్యార్థిని యు జోష్నితకు 6000 నగదు,592 మార్కులు పొందిన అక్షర పాఠశాల విద్యార్థి ఆర్ హారిక కు 4000 నగదు,591 మార్కులు పొందిన శ్రీ సాయి వికాస్ విద్యార్థిని కె.సిరి కి 2000 నగదు, 590 మార్కులు పొంది నాలుగవ స్థానంలో నిలిచిన నాగవరం విద్యార్థినీ మోక్షిత కు, స్థానిక శ్రీ పద్మావతి పాఠశాల విద్యార్థి ఋషికేశ్ వర్మ కు, శ్రీ సాయి వికాస్ విద్యార్థి ఎస్ మస్తాన్లకు ఒక్కొక్కరికి 2000 నగదును అందించారు. ప్రభుత్వ పాఠశాల నుంచి మండలంలో అత్యధిక మార్కులు సాధించిన పోలోపల్లి నుంచి జి.సుకన్య(553), నాగవరం నుంచి ఎం నిఖిత (547), వెంకట్రాజు పల్లి నుంచి డి సరళ (538), కస్తూరిబా పాఠశాల నుంచి జి హరిత(480), చిట్వేలి హైస్కూల్ నుంచి జి గణేష్ (464) లకు 1116 నగదును జ్ఞాపికను అందించి అభినందించారు. పిల్లలు పోటీపడి చదవడం అలవర్చుకోవాలని లక్ష్యం ఉన్నతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మానవతా బాధ్యులు కార్యదర్శి మునిరావు, చైర్మన్ సాయిరాం,ట్రెజరర్ సుబ్రమణ్యం రెడ్డి, కన్వీనర్ డి శ్రీనివాసులు కార్యవర్గ సభ్యులు కావేరి చంద్ర,కాలేషా,జాని,సుధీర్ రెడ్డి మరియు బాధ్యత పాఠశాలల ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడిలోని విద్యార్థులకు పలకలు పెన్సిల్ పంపిణీ





**బద్వేల్ జూలై 25 ప్రభాతవార్త..**
బద్వేల్ మండల పరిధిలోని చెన్నంపల్లి ఎంపీపీ మోడల్ స్కూల్ పాఠశాల నందు చదువుతున్న విద్యార్థులకు ప్రముఖ వస్త్ర వ్యాపారి ముచ్చర్ల సుధాకర్ మనవడు పట్నం తత్విక్ పుట్టినరోజు సందర్భముగా శుక్రవారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పలకలు పెన్సిళ్ల బలపాలు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు షామీర్ భాష మాట్లాడుతూపట్నం తత్విక్ జన్మదిన వేడుకలు మా పాఠశాల విద్యార్థుల మధ్య చేసుకోవడం మాకు ఎంతో ఆనందంగా ఉందని ప్రభుత్వ పాఠశాల లంటే ప్రస్తుతం చిన్నచూపు చూస్తున్నారని ప్రముఖ వస్త్ర వ్యాపారి ముచ్చర్ల సుధాకర్ తన మనవడి పుట్టినరోజు వేడుకలను ప్రభుత్వ పాఠశాలలో చేసుకోవడం అభినందనీయమని ఇది పది మందికి స్ఫూర్తిదాయకంగా నిలబడుతుందన్నారు. చిన్నతనము నుంచే పాఠశాలలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే కాకుండా వారికి తోటి విద్యార్థులతో కలిసి మెలిసి ఉండి ఇలాంటి జన్మదిన వేడుకలు జరుపు కోవడం పట్ల విద్యార్థులలో ఐక్యత భావం పెరుగుతుందన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు వారిని శాలువాతో పట్నం చంద్రమోళి లక్ష్మీదేవిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగ పార్వతి శారద వల్లంకొండు లక్ష్మీనారాయణ ముచ్చర్లసుధాకర్ . సుజాత పట్నం సత్యాన్వేష్ పట్నం ప్రదీప్తి పట్నం హితైషి ముచ్చర్ల ప్రవీణ్ పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో అభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే



**మదనపల్లె, జులై 25 ప్రభాతవార్త :**
గ్రామాల్లో అభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శుక్రవారం రూరల్ మండలంలోని కోటవారిపల్లె గ్రామ పంచాయితీలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి కరపత్రాల ద్వారా ఇంటింటికి వెళ్ళి ప్రజలకు తెలియజేశారు. అనంతరం గ్రామంలో నెలకొన్న ప్రజాసమస్యలను అడిగి తెలుసుకొని వారి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గత వైసిపి పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏడాదిలోనే పల్లె పండగ పేరుతో గ్రామాల్లో సిసి రోడ్లు, కల్వర్టులు, మురుగునీటి కాలువలు నిర్మించడం జరిగిందన్నారు. అర్హులందరికి సంక్షేమ పథకాలను మంజూరుచేయడం జరిగిందన్నారు. త్వరలోనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నిధులు ఖాతాలో జమకావడం జరుగుతుందతన్నారు. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో కోటావారిపల్లెకు చెందిన టిడిపి నాయకులు సొక్కం నరేష్, సొక్కం సత్యనారాయణ, మల్‌రెడ్డి, ఆనంద, మధూకర్‌రెడ్డి, చెన్నకేశవులు, క్రిష్ణమూర్తినాయక్, టిడిపి సీనియర్ నాయకులు నందకుమార్, నవీన్‌చౌదరి, పణికర్‌రెడ్డి, జేసబి వేణు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొందిన పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

**కడప జిల్లా**
పోరుమామిళ్ళ, జమ్మలమడుగు, చెన్నూరు, కొండాపురం, ఎర్రగుంట్ల రూరల్, గోపవరం, అట్లూరు, సికెదిన్నె, కడపక్రైమ్, చక్రాయపేట

**అన్నమయ్య జిల్లా**
వాయల్పాడు, రైల్వేకోడూరు, వీరబల్లి, రాయచోటి, నందలూరు, కలకడ

ఇంటర్వ్యూ తేది : 24.07.2025
మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086